సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం। 12। అక్టోబర్। 2025



టన్ను చీనీ రూ.15 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.20
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.12 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 1,500 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
34.2°/ 20.7°
జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో ఈశాన్యం నుంచి నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న వర్షాలు



నిడిమామిడిలోని ఓ వీధిలో కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ జిల్లాలోని 26 మండలాల పరిధిలో 361.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఎన్‌పీ కుంట మండలంలో 54.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక ఓడీచెరువు మండలంలో 32.2 మి.మీ, రామగిరి 26.8, సీకేపల్లి 24.6, నల్లచెరువు 24.2, చిలమత్తూరు 23.4, రొద్దం 21.8, లేపాక్షి 16.2, గాండ్లపెంట 14.2, కదిరి 12.8, తలుపుల 10.2, మడకశిర 10.2, తనకల్లు 9.8, బుక్కపట్నం 9.6, పెనుకొండ 7.4, అమరాపురం 7.2, గుడిబండ 7.2, కనగానపల్లి 6.4, కొత్తచెరువు 5.8, ధర్మవరం 5.2, పుట్టపర్తి 4.2, అమడగూరు 4.2, నల్లమాడ 3.8, హిందూపురం మండలంలో 3.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కృష్ణాపురం విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ చూపిన బుక్కపట్నం మండలం కృష్ణాపురం ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బాలాజీ కుమార్ పేర్కొన్నారు. అండర్-17 జిమ్నాస్టిక్స్‌లో ధనుష్, ధనుష్ సాయి, అండర్-14 విభాగంలో అవినాష్, స్విమ్మింగ్ అండర్-17లో శివకుమార్, అండర్-14 విభాగంలో రామ్‌విలాస్ ఎంపికైనట్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను శనివారం ఉపాధ్యాయులు అభినందించారు. ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

దోషులకు శిక్ష పడేలా పనిచేయాలి

- కోర్టు కానిస్టేబుళ్లకు ఎస్పీ సతీష్‌కుమార్ దిశానిర్దేశం



పుట్టపర్తి టౌన్: ''ప్రతి కోర్టు కానిస్టేబుల్ నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి. తమ స్టేషన్ పరిధిలోని కేసుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. ట్రయల్ జరిగే సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. కోర్టుకు సకాలంలో సాక్ష్యాధారాలు అందజేసి దోషులకు శిక్ష పడేలా చూడాలి..అప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుంది'' అని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కోర్ట్ మానిటరింగ్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. కోర్టుల్లో చార్జిషీట్ ఫైల్ చేసిన అనంతరం కోర్టు ద్వారా సీసీ నంబర్ తీసుకొని ఎప్పటికప్పుడు పెండింగ్ సమన్లు జారీ అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, సీఐ బొజ్జప్ప, పోలీసుశాఖ న్యాయ సలహాదారు సాయినాథ్‌రెడ్డి, ఐటీ కోర్ ఇన్‌చార్జ్ సుదర్శన్‌రెడ్డితోపాటు కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

'ధన్ ధాన్య కృషి' యోజనను సద్వినియోగం చేసుకోండి

ప్రశాంతి నిలయం: ప్రధాన మంత్రి 'ధన్ ధాన్య కృషి యోజన' పథకాన్ని జిల్లాలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం ఢిల్లీ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ఈ పథకాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. దేశంలోని వంద జిల్లాలో ఈ పథకం అమలు అవుతుండగా...అందులో మన జిల్లా కూడా ఒకటి. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ వర్చువల్‌గా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు 'ధన్ ధాన్య కృషి యోజన'ను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు వారిని చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, వ్యవసాయ అనుబంధ సంఘాల నాయకులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

'బలమే జీవితం.. బలహీనతే మరణం' అని ఆలోచనాత్మక వాక్యం చెప్పారు స్వామి వివేకానంద. జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకోలేక చిన్న సమస్యలకే కుంగిపోయి ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కుటుంబ సమస్యలనో.. ఆర్థిక ఇబ్బందులనో.. అనారోగ్య సమస్యలనో.. పరీక్ష తప్పామనో.. చదువు ఇష్టం లేదనో.. ప్రేమ విఫలమైందనో.. ఇలా రకరకాల కారణాలతో ఒత్తిడికి లోనై బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలు జిల్లా వ్యాప్తంగా రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రతి సమస్యకూ పరిష్కారం ఉందన్న విషయాన్ని మరచి అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు.

క్షణికావేశం..
తీస్తోంది ప్రాణం



2025లో జిల్లాలో ఆత్మహత్యలు ఇలా..

నియోజకవర్గం	ఆత్మహత్యలు
కదిరి	27
పుట్టపర్తి	19
ధర్మవరం	24
రాప్తాడు	16
పెనుకొండ	22
హిందూపురం	24
మడకశిర	21
మొత్తం	153

- పెరుగుతున్న మానసిక సమస్యలు
- అర్ధంతరంగా ముగుస్తున్న జీవితాలు
- రోజుకు ఒకరు చొప్పున బలవన్మరణం
- జిల్లాలో పెరుగుతున్న ఆత్మహత్యలు

కదిరి: ఉన్నది ఒక్కటే జీవితం. ఏం సాధించినా అందులోనే. అలాంటి అమూల్యమైన జీవితాన్ని క్షణికావేశంలో చేజేతులా సమాప్తం చేసుకుంటే వారి మీద ఆధారపడ్డవారిని, వారి మీదే ఆశలు పెట్టుకొని జీవిస్తున్నవారిని రోడ్డున పడేసినట్లే అవుతుంది. జిల్లాలో ఈ నెల 1వ తేదీ నుండి 9వ తేదీ వరకూ కేవలం 9 రోజుల్లోనే 9 మంది పలు కారణాలతో ఆత్మహత్య చేసుకున్నారంటే ఇది మామూలు విషయం కాదు. వీరిలో అధిక శాతం మంది యువతీ యువకులే. సమస్యలు ఎదురైనప్పుడు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల కారణంగానే ఇలా బలవన్మరణాలు జరుగుతాయని వైద్య నిపుణులు అంటున్నారు.

భయపెడుతున్న ఘటనలు..

- మడకశిర పట్టణానికి చెందిన మధు(23) అగళి మండలంలోని ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఇదే విషయంగా చివరకు జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఒక ప్రేమించిన అమ్మాయి తనకు దక్కదనే భావంతో క్షణికావేశంలో ఈ నెల 1వ తేదీ ఆత్మహత్య చేసుకున్నాడు.
- నల్లచెరువు మండలం అల్లుగుండు గ్రామానికి చెందిన కుళ్లాయప్ప(40) చిన్నపాటి అంశానికి భార్యతో గొడవ పడి కొన్నేళ్లుగా విడిగా ఉంటున్నాడు. చివరకు ఒంటరి జీవితంపై విరక్తి పుట్టి ఈ నెల 5న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.



సీకేపల్లి మండలం ప్యాదిండిలో ఆత్మహత్య చేసుకున్న అశ్విని (ఫైల్)



క్యాబ్ డ్రైవర్ల వేధింపులతో ఆత్మహత్యాయత్నం చేసిన హోంగార్డు ప్రియాంక (ఫైల్)

- ధర్మవరంలోని కోట కాలనీకి చెందిన తొండమాల మహేష్(37) ఓ ప్రైవేటు సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పని చేసేవాడు. పెళ్లి సంబంధాలేవీ కుదరడం లేదని మనస్థాపానికి గురై ఈ నెల 6న ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.
- మడకశిర మండలం హెచ్‌ఆర్ పాళ్యంకు చెందిన ప్రవీణ్‌కుమార్(27) సైతం పెళ్లి సంబంధాలు కుదరడం లేదని ఈ నెల 6న రాత్రి గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి గ్రామానికి చెందిన పార్వతి, గంగాధర్‌ల కుమార్తె అశ్విని(16) రామగిరి కేజీబీవీలో ఇంటర్ చదువుతుండేది. దసరా సెలవుల్లో ఇంటికొచ్చిన ఆ విద్యార్థిని తిరిగి కళాశాలకు వెళ్లడం ఇష్టంలేక ఈ నెల 8న ఇంటి పక్కనే ఉన్న షెడ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

ఇవీ హెచ్చరిక సంకేతాలు..

- ఒంటరిగా ఉండటానికి ఇష్టపడటం
- స్నేహితులకు, బంధువులకు దూరంగా ఉండటం
- విపరీతమైన కోపం, భయం ప్రదర్శిస్తూ సామాజిక కార్యక్రమాలకు దూరంగా ఉండటం.
- నిరంతరం నిస్సహాతాభావాన్ని వ్యక్త పరుస్తుండడం.
- అతిగా మద్యం సేవించడం, ప్రతీకార కాంక్షతో మాట్లాడతుండడం.
- ఏకాగ్రత, జ్ఞాపకశక్తి సమస్యలు, నిద్ర, ఆకలిలో మార్పులు ఉండడం.
- పండగలు, వివాహాల వంటి వేడుకల్లో పాల్గొనకుండా దూరంగా ఉండటం.
- స్నేహితులకు విషాదరకమైన మెజేస్‌లు పంపడం.
- చనిపోతున్నట్లు ముందుగానే వారి మాటల్లో పరోక్షంగా వ్యక్తపరుస్తుండడం.

... ఇలా ఒకరిద్దరు కాదు... ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 153 మంది బలవన్మరణాలకు పాల్పడడం ఆందోళన చెందే విషయం. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో ఆత్మహత్యలు చోటుచేసుకున్న ఘటనలు లేవు. సగటున ప్రతి రెండు రోజులకు ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇవన్నీ అధికారికంగా వెలుగు చూసిన ఘటనలే. ఇక అనధికారిక లెక్కలు మరిన్ని ఉన్నట్లుగా తెలుస్తోంది.

కౌన్సెలింగ్ అవసరం



మానసిక సమస్యలకు చికిత్స అందుబాటులో ఉంది. ప్రారంభ దశలోనే గుర్తించి తగిన కౌన్సెలింగ్ ఇప్పిస్తే వ్యతిరేక ఆలోచనల నుంచి బయట పడవచ్చు. మానసిక సమస్యలతో బాధపడే వారిని మరింత కోపానికి, ఒత్తిడికి గురి చేయడం మంచిది కాదు. వారికి ప్రశాంతమైన వాతావరణం కల్పించాలి. వీలైనంత వరకూ వారు అందరిలో ఉంటూ ఆనందంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
– డాక్టర్ ఫైరోజాబేగం, డీఎంహెచ్‌ఓ

ఒక్క క్షణం ఆలోచించాలి



జీవితం ఎంతో విలువైనది. ఆత్మహత్య చేసుకునే ముందు ఒక్క క్షణం ఆలోచించాలి. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. నమ్ముకున్న అమ్మ, నాన్న, భార్య, భర్త, పిల్లలు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువులను ఆ క్షణంలో తలుచుకుంటే ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనే రాదు. సమస్యలకు చావు పరిష్కారం కానే కాదు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తాం. యువతను మేల్కొపే కార్యక్రమాలు చేపడతాం.
– ఎస్.సతీష్‌కుమార్, ఎస్పీ

ఇన్‌చార్జ్‌లే దిక్కు!

- వేధిస్తున్న సబ్ రిజిస్ట్రార్ల కొరత
- 9 చోట్ల సీనియర్ అసిస్టెంట్లతోనే కార్యకలాపాలు
- ప్రజలకు తప్పని ఇక్కట్లు



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్ల కొరత వేధిస్తోంది. సీనియర్ అసిస్టెంట్లను ఇన్‌చార్జ్‌లుగా నియమించి నెట్టుకొస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిల్లో ఆరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కొనసాగిస్తున్నారు. అనంతపురంలోని రామ్‌నగర్ ప్రధాన కార్యాలయంలో ఇద్దరు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు ఉండాల్సి ఉండగా ఒక్కరు సైతం లేకపోవడం గమనార్హం. దీంతో ఇటీవల రూరల్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌గా ఇస్మాయిల్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పటించారు. రూరల్ కార్యాలయంలో సైతం రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ లేక రెండు నెలలుగా ఇన్‌చార్జ్‌తో నెట్టుకొస్తున్నారు. కళ్యాణదుర్గం, గుత్తి కార్యాలయాల్లో సైతం సీనియర్ అసిస్టెంట్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలిచ్చారు. ఇక కదిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు ఉండాల్సి ఉండగా.. ఒకరు మాత్రమే ఉన్నారు. తనకల్లు, చిలమత్తూరు కార్యాలయాలకు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు లేకపోవడంతో అనంతపురంలోని సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌బాబును ఇన్‌చార్జ్‌గా చిలమత్తూరుకు పంపారు. తనకల్లులో అక్కడే పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌కు బాధ్యతలు ఇచ్చారు.

ప్రజలకు చుక్కలు..

రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. చిన్న పనికి సైతం రోజు తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. వెంటనే అధికారులు దృష్టి సారించి రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లను నియమించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ విజయలక్ష్మిని సంప్రదించగా.. ఉమ్మడి జిల్లాలో 9 మంది కొత్త సబ్ రిజిస్ట్రార్ల అవసరం ఉందన్నారు. ఇదే విషయాన్ని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలోనే కొత్త ఎస్‌ఆర్‌లను కేటాయిస్తారన్నారు. అప్పుడు ఖాళీలన్నీ భర్తీ చేస్తామన్నారు.

రెచ్చిపోతున్న 'కాపర్ దొంగలు'

మార్కెట్‌లో కాపర్ కేజీ రూ.900 వరకు ధర పలుకుతోంది. దీంతో దొంగలు కాపర్ కోసం వ్యవసాయ మోటార్ల వద్ద ఉన్న విద్యుత్ కేబుళ్లు కత్తిరించి ఎత్తుకెళ్తున్నారు. ఆ తర్వాత వాటి నుంచి కాపర్ వేరు చేసి కేజీ రూ.400తో విక్రయిస్తున్నారు. పొలాల్లో ఎవరూ ఉండకపోవడంతో దొంగల పని సులువవుతోంది. కానీ 'కాపర్ దొంగల' దెబ్బకు రైతు జేబులు ఖాళీ అవుతున్నాయి.

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కేబుళ్ల చోరీ
- వరుస ఘటనలతో రైతుల బెంబేలు
- ఫిర్యాదు చేస్తే ఎఫ్‌ఐఆర్‌తో సరిపెడుతున్న పోలీసులు



బుక్కపట్నం మండలం వద్ద కేబులు కోసిన దృశ్యం

పుట్టపర్తి టౌన్: జిల్లాలో కాపర్ దొంగలు రెచ్చిపోతున్నారు. నిత్యం ఏదో ఒకచోట వ్యవసాయ బోర్ల వద్ద విద్యుత్ మోటార్లకు ఉన్న కేబుల్ వైర్లను కత్తిరించి ఎత్తుకుపోతున్నారు. ఈ క్రమంలో మోటార్లు బోర్లలో పడిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం ఎక్కడో చోట కాపర్ చోరీ..

జిల్లాలోని 32 మండలాల పరిధిలో దాదాపు లక్షకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఆరు నెలల నుంచి కాపర్ దొంగలు స్వైర విహారం చేస్తున్నారు. వ్యవసాయ బోర్లు నుంచి మోటార్లలోకి విద్యుత్ సరఫరా చేసే కాపర్ కేబుళ్లను కోసి చోరీ చేస్తున్నారు. దీంతో మోటార్లు వందల అడుగుల లోపలికి పడిపోతున్నాయి. వాటిని మళ్లీ బయటకు తీసి కొత్తగా కేబుల్ వేసి మళ్లీ అమర్చాల్సి వస్తుంది. ఈ పని చేయడానికి ఒక్కో మోటార్‌కు కనీసం రూ.8 వేల వరకు వెచ్చించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోపల పడిపోయిన మోటార్ తీసేందుకు ఒక్కోసారి రెండు, మూడు రోజులు పడుతుండగా... పంటలకు నీళ్లు అందని పరిస్థితి నెలకొంది. ఒక్కో మోటార్ వద్ద రెండు, మూడు సార్లు చోరీలు జరగడంతో రైతుల కంటి మీద కునుకు లేకుండా పోతోంది.

దృష్టి సారించని పోలీసులు..

కాపర్ కోసం దొంగలు కేబుళ్లను చోరీ చేస్తున్న ఘటనలపై సంబంధిత పోలీస్‌స్టేషన్లలో కేసు కూడా నమోదవుతున్నాయి. అయితే పోలీసులు వీటిపై పెద్దగా దృష్టి సారించడం లేదు. రైతులు ఫిర్యాదు చేయగానే, ఎఫ్‌ఐఆర్ మాత్రం నమోదు చేస్తున్నారు. గట్టిగా నిలదీస్తే పొలాల్లో అర్ధరాత్రి వేళ జరిగే ఘటనలకూ తామే బాధ్యులమా అని ఎదురు ప్రశ్నిస్తున్నారని రైతులు వాపోతున్నారు. కనీసం గ్రామాల్లో పర్యటించి అనుమానితులను ప్రశ్నిస్తే చోరీ కేసులు పరిష్కారమవుతాయని రైతులు అంటున్నారు. అలాగే గతంలో దొంగతనం చేసిన వారిపై కూడా పోలీసులు దృష్టి సారించాలని కోరుతున్నారు. రాత్రి వేళల్లో బీట్లు నిర్వహించి కాపర్ దొంగల పనిపట్టాలని వేడుకుంటున్నారు.

రెండుసార్లు కోశారు



నా బోరు వద్ద కరెంటు వైర్లను రెండు సార్లు కోసి ఎత్తుకెళ్లారు. వైరు ఖర్చు కన్నా బోరులో పడిపోయిన మోటార్‌ను బయటకు తీసి మళ్లీ అమర్చుకునేందుకే ఎక్కువ ఖర్చు అవుతోంది. కీలకమైన సమయంలో వైర్లు కోయడంతో పంటకు నీరందక ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఆరు నెలల నుంచి చోరీలు అధికమయ్యాయి.
– ఈశ్వర్‌రెడ్డి, బీడుపల్లి, పుట్టపర్తి మండలం

మోటార్లు బోర్లలో పడుతున్నాయి



దొంగలు కాపర్ కోసం కేబుల్ వైర్లు కత్తిరించి ఎత్తుకెళ్తున్నారు. దీంతో మోటార్లు బోర్లలో పడిపోతున్నాయి. నాకు రెండు బోరు మోటార్లు ఉన్నాయి. రెండు చోట్ల వైర్లు చోరీ చేశారు. దీంతో కొత్తగా వైరు కొనడంతో పాటు మోటార్‌ను బయటకు తీయడానికి చాలా ఖర్చయ్యింది.
– ఆదినారాయణ, రైతు, దబురువారిపల్లి, పుట్టపర్తి మండలం

పోలీసులు చర్యలు తీసుకోవాలి

నిత్యం ఏదో ఒక చోటు కేబుల్‌వైర్లు చోరీకి గురవుతున్నాయి. మా గ్రామంలోనూ ఇద్దరు, ముగ్గురు రైతుల బోరు మోటార్ల వద్ద వైర్లు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనలపై రైతులు ఇప్పటికే ఫిర్యాదు చేయగా.. కేసులు నమోదు చేశారు. అయితే పోలీసులు దర్యాప్తులో చొరవ చూపడం లేదు. అనుమానితులను ప్రశ్నిస్తే ఫలితం ఉంటుంది. అలాగే రాత్రి వేళల్లో నిఘా పెంచాలి. లేకపోతే చోరీలు నివారించడం కష్టం.
– ప్రసాద్, రైతు, జగరాజుపల్లి, పుట్టపర్తి మండలం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పోరుబాట



పార్టీ నేతలతో కలిసి కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉషశ్రీచరణ్

- కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టిన ఉషశ్రీచరణ్

రొద్దం: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వైద్యవిద్యను అభ్యసించే వారికి సీట్లు అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణ చేపట్టింది. ఈ ప్రజా ఉద్యమానికి శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ శ్రీకారం చుట్టారు. మండలంలోని తాడంగిపల్లి, మోపుర్లపల్లి, ఎం.కొత్తపల్లి, గోరాజుపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించి, సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ... పేదలకు మంచి జరగాలన్న సంకల్పంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధమైందని, అదే జరిగితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వైద్య విద్యార్థులకు వైద్యవిద్య దూరమవుతుందన్నారు. సర్కార్ చర్యలకు వ్యతిరేకంగా సాగుతున్న ఈ మహా ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని ముందుకు నడిపించాలన్నారు.

సవితా ప్రజల రుణం తీర్చుకో..

మంత్రి సవిత కూడా తన పదవికి రాజీనామా చేసి తాము చేపడుతున్న కోటి సంతకాల ఉద్యమంలోకి రావాలని ఉషశ్రీచరణ్ ఆహ్వానించారు. పెనుకొండ మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను అడ్డుకుని ఓట్లేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, ఎంపీపీ నాగమ్మ, సోమందేపల్లి మండల కన్వీనర్ గజేంద్ర, జెడ్పీటీసీ అశోక్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ ఇమామ్ వలి, ప్రతాప్‌రెడ్డి, వేణు, నాయకులు సి.నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్. నారాయణరెడ్డి, స్థానిక నాయకులు రామాంజనేయులు, వీరేష్, మురళి, ఇస్లాపురం అంజి, రాజేశ్, మనీంద్రరెడ్డి, ఈశ్వర్, తిమ్మారెడ్డి, ప్రసన్న, అన్ని అనుబంధ కమిటీలు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దేవేరులతో కలిసి భక్తులకు దర్శనమిచ్చిన ఖాద్రీశుడు

వసంతవల్లభా.. గోవిందా

- భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీశుని ఆలయం

కదిరి టౌన్: అందరిలోనూ అదే భక్తిభావం. శ్రీవారి దివ్యమంగళ రూపాన్ని కనులారా దర్శించాలన్న తపన. అందుకే గంటల తరబడి క్యూలో వేచి ఉన్నారు. ఆ దేవదేవుడి నామాన్ని జపిస్తూ తన్మయత్వం చెందారు. దీంతో కదిరి శనివారం వసంతవల్లభుడి నామస్మరణతో మార్మోగింది. స్వామి వారికి ప్రీతికరమైన శనివారం కావడంతో కదిరి ఖాద్రీశుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. ఖాద్రీశుని దర్శనంతో పులకించిపోయారు. 'ఓం నమో నరసింహ' అంటూ శ్రీవారిని కీర్తించారు. భక్తులకు ఆలయ కమిటీ తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేసింది.



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

క్లుప్తంగా

విజయనగర రాజుల శాసనాలు లభ్యం


శాసనాన్ని చూపిస్తున్న ఉపాధ్యాయుడు గోపి

కొత్తచెరువు: వంగంపల్లిలో విజయనగర రాజుల కాలం నాటి రెండు అరుదైన శాసనాలను గుర్తించినట్లు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గోపి శనివారం తెలిపారు. వీటిలో ఒకటి వామన ముద్ర వలయ శాసనం . ఈ శాసనాన్ని శ్రీకృష్ణదేవరాయలు ఆంతరంగిక భటుడు గొడుగుపాలుడు వేయించాడని ఉపాధ్యాయుడు తెలిపారు. ఈ శాసనాన్ని గొడుగుపాలుని శాసనం అని కూడా అంటారన్నారు. ఈ శాసనం వంగంపల్లిలో భూదానం గురించి తెలియజేస్తుందన్నారు. ఈ శాసనం పై భాగంలో 'అరికపవపురదసీమ' అని రాసి ఉందన్నారు. దీన్ని బట్టి 'అరికపవపుర' అనేది ప్రస్తుత వంగంపల్లి ఉన్న ప్రదేశానికి విజయనగర సామ్రాజ్య కాలం నాటి పేరని రదసీమ అంటే రాజ్యంలోని పరిపాలన విభాగం అని వెల్లడించారు. ఇక రెండవ శాసనం శ్రీకృష్ణదేవరాయల అన్న వీర నరసింహరాయలు వేయించిన శాసనం అని పేర్కొన్నారు. ఈ శాసనం ప్రకారం వంగంపల్లి పరిసర ప్రాంతాలు తన ఏలుబడిలో ఉన్నట్టు వీర నరసింహరాయలు ఈ శాసనంలో పేర్కొన్నారన్నారు. ఈ రెండు శాసనాలను పురావస్తు శాఖ వారు ఇంత వరకు నమోదు చేయలేదన్నారు. ఈ రెండు శాసనాల సమాచారాన్ని పురావస్తు శాఖకు అందించినట్లు గోపి తెలిపారు. ఇదే గ్రామంలో రెండేళ్ల క్రితం శ్రీకృష్ణదేవరాయలు తమ్ముడు అచ్యుత దేవరాయలు శాసనాన్ని తాను గుర్తించినట్టు చెప్పారు. శ్రీకృష్ణదేవరాయలు, ఆయన అన్న వీర నరసింహరాయలు, తమ్ముడు అచ్యుత దేవరాయలుకు సంబంధించిన మూడు శాసనాలు ఒకే గ్రామంలో ఉండడం వంగంపల్లి ప్రత్యేకతని అన్నారు.

యువకుడి ఆత్మహత్య


కులవర్ధన్ (ఫైల్)

రాప్తాడు: ఇంట్లో మందలించారని మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మవరం రైల్వే పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.... అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన రాము, లక్ష్మీదేవి దంపతులు. పదేళ్ల క్రితం రాము మృతి చెందాడు. అప్పటి నుంచి కుమారుడు కులవర్ధన్ (21) వ్యవసాయ పనులతో పాటు తల్లితో కలిసి పాడి ఆవులు పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇదిలా ఉండగా ఏడాది క్రితం అప్పు చేసి రూ.లక్ష విలువైన బైక్ కొనుగోలు చేశాడు. వీటిని తీర్చలేక, పనులకు వెళ్లకపోవడంతో ఇంట్లో మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన కులవర్ధన్ శనివారం గంగులకుంట గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే కీమెన్ సమాచారంతో ధర్మవరం రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతుని వద్ద దొరికిన సెల్ ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రైవేటీకరణతో వైద్య విద్య దూరం

- ప్రభుత్వ వైద్య కళాశాలలకు రూ.4వేల కోట్లు ఖర్చు చేయలేరా?
- ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించలేరా?
- కూటమి ప్రభుత్వంపై వక్తల మండిపాటు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

పెనుకొండ: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో పేదలకు వైద్య విద్యను దూరం చేయడమేనని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి బోధనాస్పత్రులు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ద్వారా సేవలు అందించలేరా అని మండిపడ్డారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ రాయలసీమ అభివృద్ధి వేదిక అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ, రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేయించిందన్నారు. ఇందులో ఇప్పటికే పలు కాలేజీలు పూర్తయి తరగతులు కూడా జరుగుతున్నాయన్నారు. మిగిలిన కాలేజీల భవన నిర్మాణ పనులు పూర్తి చేయాల్సిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేయడం సరికాదన్నారు. నూతన కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే వైద్య విద్యను అభ్యసించడం పేద, మధ్య తరగతి వర్గాల వారికి పెనుభారంగా మారుతుందన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంటే వైద్య విద్య ఫీజులు పరిమితంగా ఉంటాయన్నారు. ప్రైవేటు వారి ఆధీనంలో ఫీజులకు హద్దు లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతిలో రూ.లక్ష కోట్లకు పైగా వెచ్చించి అభివృద్ధి చేస్తామంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. నూతన ప్రభుత్వ మెడికల్ కాలేజీల భవన నిర్మాణ పనులకు రూ.4వేల కోట్లు ఖర్చు చేయలేకపోవడం బాధాకరమన్నారు. మెడికల్ కళాశాలలను నారాయణ, అపోలోకు అప్పగించే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో పెనుకొండలోని అర్బన్, రూరల్ హెల్త్ సెంటర్‌లు ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లిపోయి ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడడం ఖాయమన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత చికిత్సలకూ ఇబ్బందులు తప్పవన్నారు.

ప్రైవేటీకరణతో తీవ్ర అన్యాయం..

పేద, మధ్య తరగతి విద్యార్థులు సైతం వైద్య విద్యను అభ్యసించాలని నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ నేత ఆవుటాల రమణారెడ్డి అన్నారు. కరోనా సమయంలో ప్రజలు పడిన ఇబ్బందులు భవిష్యత్తులో రాకూడదని మెడికల్ కాలేజీలను తీసుకొస్తే.. కూటమి ప్రభుత్వం వాటిని కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రైవేటీకరణతో ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు బాధ్యతగా ఉండాలే కానీ.. ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకోవడం భావ్యం కాదన్నారు. పెనుకొండ మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ అవుతున్నా స్థానిక మంత్రి తనకేమీ పట్టనట్టు ఉండటం బాధాకరమన్నారు. ఈ అన్యాయాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

పేద విద్యార్థుల కల చెదిరింది..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన మెడికల్ కాలేజీల నిర్మాణానికి తీసుకున్న చర్యలు అభినందనీయమైనవని బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ అన్నారు. పేదలకు తక్కువ ఫీజులతో మెడిసిన్ చదివే అవకాశం కల్పించిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేద విద్యార్థుల మెడిసిన్ కల చెదిరినట్లయ్యిందన్నారు. దీనిపై విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు, మేధావులు, రాజకీయ పార్టీలు ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు.

ప్రజా శ్రేయస్సుపై చిత్తశుద్ధేదీ?

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజా శ్రేయస్సుపై ఏమాత్రమూ చిత్తశుద్ధి లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి తనకు కావలసిన వారికి ధారాదత్తం చేయడమే బాబు నైజమన్నారు.

ప్రజల్లో తిరుగుబాటు వస్తుంది..

ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు వస్తుందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ స్పష్టం చేశారు. ఎంతో వెనుకబడిన పెనుకొండకు మెడికల్ కళాశాల మంజూరు చేస్తే.. వాటి ఫలాలు అనుభవించకుండా కూటమి ప్రభుత్వం 'ప్రైవేటీకరణ' కుట్ర పన్నడం బాధాకరమన్నారు.

దుర్మార్గమైన చర్య..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలను దృష్టిలో ఉంచుకుని 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు కంబాలప్ప పేర్కొన్నారు. ఇందులో భాగంగా రూ.30 కోట్ల మేర ఖర్చు చేసి పెనుకొండ కళాశాల పనులు చేపడుతుంటే కూటమి సర్కారు అర్ధాంతరంగా నిలిపివేసి పీపీపీ విధానానికి తీసుకురావడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు.

పీపీపీ విధానంతో మోసం..

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రజలు, మేధావులు, విద్యార్థులు ఎవ్వరూ హర్షించరని ఏఐఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివకుమార్ అన్నారు. మెడికల్ కాలేజీతో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందడంతో పాటు పేదలకు వైద్య విద్య అభ్యసించే అవకాశం కలుగుతుందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం పేరిట ప్రజలను దారుణంగా మోసం చేస్తోందన్నారు.

మంత్రి స్పందించాలి..

నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాన్ని పీపీపీ విధానంలో చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపై మంత్రి సవిత స్పందించాలని పెనుకొండ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బోయ నరసింహులు డిమాండ్ చేశారు. పేదలకు అన్యాయం జరుగుతోందని తెలిసి కూడా ముఖ్యమంత్రితో మాట్లాడి న్యాయం చేయకపోవడం బాధాకరమన్నారు.

ప్రాణత్యాగానికైనా సిద్ధం..

వెనుకబడిన పెనుకొండ ప్రాంతానికి మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలను పీపీపీ విధానంలో తీసుకురావడం దారుణమని మాల మహానాడు కన్వీనర్ ఎంఎస్.మూర్తి విమర్శించారు. ఈ ప్రాంత విద్యార్థులు, పేద ప్రజల జీవితాలతో చెలగాటమాడటం సరికాదన్నారు. మెడికల్ కళాశాల పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టే పోరాటంలో ప్రాణాలైనా త్యాగం చేస్తామన్నారు. ప్రజల ఆస్తులను పప్పుబెల్లాల్లా కార్పొరేట్‌కు అప్పజెప్పడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, జేవీవీ నాయకులు ఆదిశేషు, కాంగ్రెస్ నాయకులు గంగాధర్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉగ్ర కదలికలపై ఖాకీ కన్ను

- ఉగ్రలింకుల వేటలో జిల్లా పోలీసులు
- నూర్ మహమ్మద్‌తో చాటింగ్ చేసిన వారికోసం గాలింపు
- ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో కొనసాగుతున్న వేట



ధర్మవరం: ఉగ్ర కదలికలపై పోలీసులు డేగ కన్ను వేశారు. ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్న నూర్ మహమ్మద్ పట్టుబడటంతో అతనితో సంబంధాలున్న వారి కోసం పోలీసులు వేట మొదలెట్టారు. ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్న వారి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ఇప్పటికే ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రకు వెళ్లాయి.

వాట్సాప్ చాటింగ్ ఆధారాలతో తీగలాగుతూ...

ధర్మవరానికి చెందిన కొత్వాల్ నూర్ మహమ్మద్ పాకిస్తాన్ నిషేధిత ఉగ్రవాద సంస్థలతో వాట్సాప్ ద్వారా సంభాషించడం, చాటింగ్ చేయడంతో పోలీసులు అతన్ని ఆగస్టు 16వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. అతను ఎవరెవరితో చాటింగ్ చేశాడు.. వారి అడ్రస్‌లు, వారికీ ఉగ్రవాద సంస్థలతో ఉన్న సంబంధాలపై ఇప్పటికే ఆరా తీశారు. ఈ క్రమంలోనే నూర్ మహమ్మద్ పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలకు చెందిన 30కిపైగా గ్రూపుల్లో చాటింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. కోర్టు అనుమతితో అతని నుంచి స్వాధీనం చేసుకున్న సిమ్‌కార్డులు, మొబైల్ ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ప్రస్తుతం ల్యాబ్ నుంచి వచ్చిన ఆధారాలను సేకరించి నూర్ మహమ్మద్ ఎవరెవరితో చాటింగ్ చేశాడు... వాట్సాప్ గ్రూపుల్లో యాక్టివ్‌గా ఉండేవారు ఎంత మంది, ఎవరెవరిని ఉగ్రవాద సంస్థల్లో చేరేలా ప్రేరేపించాడు, వారి ఆధారాలను పోలీసులు సేకరించారు. ఈ నివేదికలో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్న వారి ఆచూకీ లభ్యమైనట్లు సమాచారం. ఎక్కువగా ఈ రెండు రాష్ట్రాల్లో ఉంటూ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్న వారితో నూర్ మహమ్మద్ చాటింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. వారందరినీ అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, ముదిగుబ్బ సీఐ శివరాముడు ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక పోలీసు బృందాలు శనివారం ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రకు వెళ్లినట్లు విశ్వసనీయంగా తెలిసింది. త్వరలోనే నూర్ మహమ్మద్‌తో సంబంధాలున్న వారిని అరెస్టు చేసి ఇక్కడకు తీసుకువచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

మంత్రులకు రైతుల గోడు పట్టదా?

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్


మొక్కజొన్న రైతుతో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

రొద్దం: జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా రైతుల గోడు పట్టడం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. శనివారం సాయంత్రం ఆమె తాడింగిపల్లిలో పర్యటించారు. మొక్కజొన్న రైతులను కలిసి.. పంట దిగుబడిపై ఆరా తీశారు. గతంలో క్వింటాలు మొక్కజొన్న రూ.2,500 నుంచి రూ.2800 దాకా ఉండేదని, ప్రస్తుతం ధరలు అమాంతంగా పతనమయ్యాయని రైతులు తెలిపారు. క్వింటాలు రూ.1,800 నుంచి రూ.1,900 మాత్రమే పలుకుతుండటంతో గిట్టుబాటు కావడం లేదన్నారు. గత ప్రభుత్వం మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరతో కొలుగోలు చేసి ఆదుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. అనంతరం ఉషశ్రీచరణ్ మీడియాతో మాట్లాడుతూ దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా మార్కెట్లో మొక్కజొన్నకు గిట్టుబాటు ధరలేకపోవడం బాధాకరమన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం తాత్సారం చేయడంపై మండిపడ్డారు. దీంతో ధర నిర్ణయం దళారుల ఇష్టారాజ్యంగా మారిపోయిందన్నారు. రొద్దం మండలంలో ఈ ఏడాది మొక్కజొన్న అధికంగా సాగు చేశారన్నారు. ధర లేకపోవటంతో కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న రాశులు వర్షాలకు తడుస్తున్నాయన్నారు. రైతులు కష్టాల్లో ఉన్నా పలకరించే తీరిక మంత్రి సవితకు లేకపోయిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం మొక్కజొన్నకే కాదు ఉల్లి, చీనీ, దానిమ్మ తదితర ఏ పంటలకూ గిట్టుబాటు ధర కల్పించలేకపోయిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిమ్మయ్య నాగమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు ఎస్.నారాయణరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, సి.నారాయణరెడ్డి, సినిమా నారాయణ, అమీర్, స్థానిక నాయకులు హనుమంతరెడ్డి, నారాయణరెడ్డి, పెద్ద తిమ్మారెడ్డి, కుళ్లాయప్ప, మహ్మద్, అన్ని అనుబంధ కమిటీల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

యువతులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పిలుపు



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

అనంతపురం కల్చరల్: యువతులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పిలుపునిచ్చారు. ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) రాష్ట్ర మహాసభల సందర్భంగా మూడురోజుల పాటు సాగిన సాంస్కృతికోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజ్ డ్రామా హాలు వేదికగా సాగిన వేడుకలకు ఐద్వా రాష్ట్ర నేతలు రమాదేవి, సావిత్రి, డాక్టర్ ప్రసూన, డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రియాజుద్దీన్, వన్నూర్ మాస్టర్ తదితరులు ఆత్మీయ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం కూడా కలిసి రావడంతో వారు చిన్నారులకు బోధనా పద్ధతుల్లో మహిళల శక్తిని, సాధికారతను వివరించిన తీరు ప్రశంసలందుకుంది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ముగింపు ఉత్సవాలలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్యంగా అశోక్‌మాస్టర్ , విజయ్ మాస్టర్ శిష్య బృందాలతో కలిసి పల్లెటూరు మా పల్లెటూరు, ఘల్లు ఘల్లు జోడెద్దులబండిరా నృత్యాలు, వరకట్నం లఘునాటికను నిషిత , ఆరాధ్యా బృందాల అద్భుతంగా ప్రదర్శించి మెప్పించారు. అలాగే ప్రజానాట్యమండలి కళాకారుల ఉద్దీపన గీతాలతో ఆడిటోరియాన్ని హోరెత్తించారు. అనంతరం మూడురోజులుగా ప్రేక్షకులను అలంరింపజేసిన మాస్టర్లకు, చిన్నారులకు జ్ఞాపికలందించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, చంద్రిక, అశ్విని, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాపం జయరంగారెడ్డి..

- రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స కోసం అవస్థలు
- ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిపివేయడంతో సకాలంలో అందని వైద్యం


రోడ్డు ప్రమాదంలో గాయపడిన జయరంగారెడ్డి

పుట్లూరు: నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిచిపోవడంతో సకాలంలో వైద్యం అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల పదో తేదీన ఉపాధి హామీ పనుల కోసం వెళుతున్న సమయంలో తూఫాన్ వాహనం ఢీకొనడంతో గోపురాజుపల్లికి చెందిన జయరంగారెడ్డి, వసంత గాయపడ్డారు. వీరిలో జయరంగారెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కూలి పనులకు వెళ్లి జీవనం సాగించే జయరంగారెడ్డి కుటుంబంలో ఇప్పటికే భార్య కంటి ఆపరేషన్ చేయించుకోగా, కుమారుడు రాజారెడ్డి నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స తీసుకుంటున్నాడు. ఇలాంటి సమయంలో అండగా ఉన్న జయరంగారెడ్డి రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో ఆ కుటుంబంలో అంధకారం నెలకొంది. ఇదే సమయంలో ఎన్టీఆర్ వైద్య సేవలను ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పలు నిలిపివేయడంతో సకాలంలో మెరుగైన వైద్యం అందలేదు. గాయపడిన జయరంగారెడ్డిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే కాలు విరగడంతో పాటు నరాలు తెగిపడటం వల్ల సర్జరీ చేయడానికి న్యూరో సర్జన్ అందుబాటులో లేరనే కారణంతో చికిత్స ఆలస్యమౌతోంది. రోజులు గడిస్తే కాలు తొలగించాలని వైద్యులు చెబుతుండటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటుగా వైద్యం చేయించేందుకు ఆపన్నహస్తం కోసం అర్థిస్తున్నారు. ప్రత్యేక సహాయ నిధితో జయరంగారెడ్డిని ఆదుకోవాలని గోపురాజుపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం

తాడిపత్రి రూరల్: ప్రేమలో విఫలమైన యువకుడు అర్ధాంతరంగా తనువు చాలించాడు. తల్లిదండ్రులకు గుండెకోత మిగిల్చాడు. జీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దపాలమడ గ్రామానికి చెందిన సోమశేఖర్ (29) తల్లిదండ్రులు క్రిష్ణవేణి, మునయ్యతో కలిసి చేనేత మగ్గం నేసేవాడు. కొంత కాలం క్రితం సోమశేఖర్ ఓ యువతిని ఇష్టపడ్డాడు. తన ప్రేమ ప్రతిపాదనకు యువతి ఒప్పుకుంటే వివరాలు చెబుతానని తల్లిదండ్రుల వద్ద చెప్పాడు. ఈ క్రమంలో తన ప్రేమను వ్యక్తపరచిన సోమశేఖర్‌కు యువతి నుంచి తిరస్కరణ ఎదురైంది. ఇక అప్పటి నుంచి మూడీగా ఉండేవాడు. ఏమైందని తల్లిదండ్రులు ఆరా తీస్తే.. ఆమె లేనిదే తనకు జీవితం లేదని చెప్పాడు. రోజూ బాధతో కుంగిపోతున్న కుమారుడిని ఓదార్చేందుకు ప్రయత్నించారు. అయినా సోమశేఖర్ జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి మండలంలోని కోమలి రైల్వే స్టేషన్ వద్ద రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలట్ సమాచారం మేరకు జీఆర్‌పీఎఫ్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డులోని వివరాల మేరకు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో నెమలి మృతి


మృతి చెందిన నెమలి

చిలమత్తూరు: రోడ్డు ప్రమాదంలో నెమలి మృతి చెందింది. తుమ్మలకుంట సమీపంలోని శనివారం ఉదయం రోడ్డు దాటుతున్న నెమలిని గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నెమలి మృతి చెందింది. అయితే కాసేపటికే నెమలిని మాయం చేశారు. సమీప గ్రామాలైన తుమ్మలకుంట, కాపుచెన్నంపల్లి, చిలమత్తూరుకు చెందిన వారు ఎవరైనా ఎత్తుకెళ్లి ఉంటారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వృద్ధురాలు ఆత్మహత్య


మృతురాలు వెంకటలక్ష్మమ్మ

ఎన్పీకుంట: బలిజపల్లిలో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన కమ్మల వెంకటలక్ష్మమ్మ (82) గత కొంత కాలంగా నోటి క్యాన్సర్‌తో బాధపడుతోంది. తనకు సపర్యలు చేయడానికి ఎవరూ లేకపోవడంతో మనస్తాపానికి గురైన వెంకటలక్ష్మమ్మ బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యం


హేమావతి (ఫైల్)

కదిరి టౌన్: పట్టణంలోని ఆడపాలవీధి వైఎస్సార్ పార్క్ సమీపంలో నివాసం ఉండే హేమావతి అనే వివాహిత అదృశ్యమైంది. ఈ నెల నాలుగో తేదీన భర్తతో ఏదో చిన్న విషయమై గొడవ పడింది. తర్వాత ఎవ్వరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఎన్నిచోట్ల వెదికినా కనిపించకపోవడంతో భర్త జగన్నాథం శివ శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

ప్రేమ పేరుతో వంచన

- అత్యాచారం కేసు నమోదు
- నిందితుడికి రిమాండ్

రాప్తాడురూరల్: ప్రేమ పేరుతో దగ్గరై పెళ్లికి ముఖం చాటేసిన యువకుడిపై అత్యాచారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం రూరల్ మండలానికి చెందిన ఓ యువతి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. ఈమెకు ఆరు నెలల కిందట వరుణ్‌తేజ్ అనే లా విద్యార్థితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని చెప్పిన వరుణ్‌తేజ్.. శారీరకంగా దగ్గరయ్యాడు. తర్వాత పెళ్లి గురించి ప్రస్తావన తెస్తే మాట మార్చాడు. ఎన్నిసార్లు బతిమాలినా నిరాకరించడంతో తను మోసపోయానని యువతి గ్రహించింది. తనను నమ్మించి అత్యాచారం చేశాడని బాధితురాలు శనివారం అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడు వరుణ్‌తేజ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ప్రమాదవశాత్తూ కానిస్టేబుల్ మృతి

రాప్తాడురూరల్: ప్రమాదవశాత్తూ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారుజామున అనంతపురం రూరల్ మండలం బసవతారకనగర్‌లో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. బసవతారకనగర్‌లో నివాసం ఉంటున్న సతీష్‌కుమార్ (38) అనంతపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో పాలు తెచ్చేందుకని బైక్‌పై వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ సతీష్‌కుమార్‌ను తొలుత ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స ప్రారంభించేలోపే మృత్యువాతపడ్డాడు. వివాదారహితుడిగా సతీష్‌కుమార్ మంచి గుర్తింపు ఉంది. అకాలమృతిని సన్నిహితులు, డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు జీర్ణించుకోలేకపోయారు. మృతుడికి భార్య మంజుతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.

గార్లదిన్నె: అనంతపురం ట్రాఫిక్ కానిస్టేబుల్ సతీష్‌కుమార్ (38) అంత్యక్రియలు శనివారం గార్లదిన్నె మండలం పాత కల్లూరులో పోలీసు లాంఛనాలతో నిర్వహించినట్లు శింగనమల సీఐ కౌలుట్లయ్య తెలిపారు. సతీష్‌కుమార్ 2011 నుంచి పోలీసు శాఖలో పనిచేస్తున్నారన్నారు.

జిల్లా ఆస్పత్రికి పూర్వవైభవం తెస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం టౌన్: హిందూపురం జిల్లా ఆస్పత్రికి పూర్వ వైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే బాలకృష్ణ తెలిపారు. శనివారం కలెక్టర్ శ్యాం ప్రసాద్‌తో కలిసి జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కలెక్టర్, ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులతో కలిసి భూ సేకరణ అంశంపై ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. త్వరలో రేడియాలజిస్టును నియమించి స్కానింగ్‌తో పాటు సీటీ స్కాన్ సేవలను సైతం అందుబాటులోకి తెస్తామన్నారు. హిందూపురం నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఇందులో భాగంగా ఈ ప్రాంతంలో ఏరో స్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్ పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు మంచి ధర ఇప్పించే బాధ్యత తనదని అన్నారు. కార్యక్రమాల్లో పెనుకొండ సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్, తహసీల్దార్ వెంకటేశు, ఏపీఐఐసీ జెడ్ఎం, డీసీహెచ్ఎస్, ఆస్పత్రి మెడికల్ సూపరిటెండెంట్ అన్నపూర్ణ, ఆర్ఎంఓ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.